హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన బీఆర్ఎస్ మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. పక్కన బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, చిత్రంలో మాజీ మంత్రి మల్లారెడ్డి ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, సుధీర్‌రెడ్డి, వివేకానంద, మాధవరం కృష్ణారావు, రాజశేఖర్‌రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు వాణీదేవి, యెగ్గె మల్లేశం తదితరులు

ఇప్పటికైనా సిద్ధమా!

మల్కాజిగిరికిలో పోటీపై రేవంత్‌కు కేటీఆర్ సవాల్

దమ్ముంటే ఇప్పటికైనా పోటీకి రావాలి.. నేనూ వస్తా

ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ చెయ్.. బాధ్యులను లోపలెయ్.. మేం వద్దనం

లంకెబిందెలు కాదు హైదరాబాద్‌లో ఖాళీ బిందెలు కనిపిస్తున్నాయి

రేవంత్.. నువ్వు రాహుల్ మనిషివా? బీజేపీ మోదీ మనిషివా?

పోటీ పదేండ్ల నిజానికి, 100రోజుల అబద్ధానికి, పదేండ్ల విష బీజేపీకి!

మల్కాజిగిరి నియోజకవర్గ సమావేశంలో బీఆర్ఎస్ నేత కేటీఆర్

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిరికోడు అని, ఎంపీగా తన సిట్టింగ్ స్థానమైన మల్కాజిగిరిలో పోటీ చేద్దామంటే పారిపోయాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఎద్దేవా చేశారు. ఎంపీగా ఐదేండ్లలో రేవంత్‌రెడ్డి మల్కాజిగిరికి ఒక్క పనీ చేయలేదని, ఒక్క కాలనీ కూడా తిరగలేదని దుయ్యబట్టారు. ఈ ఎన్నికల్లో పోటీ పదేండ్ల (బీఆర్ఎస్) నిజానికి, వంద రోజుల అబద్ధానికి (కాంగ్రెస్), పదేండ్లు విషం చిమ్మిన బీజేపీకి మధ్య జరుగుతున్నదని పేర్కొన్నారు. బుధవారం తెలంగాణభవన్‌లో మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. నిన్న ఒక యూట్యూబ్ చానల్ చూశానని, 10 లక్షల ఫోన్లను కేసీఆర్ ట్యాప్ చేశాడంటూ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో నాగార్జున సినిమాలో గ్రీకువీరుడు అనే పాట ఉండేదని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి లీకువీరుడుగా మారారని ఎద్దేవా చేశారు. ఆయనకు సీఎం పదవిని నడపాస్తలేదని విమర్శించారు.

'ధైర్యం ఉంటే నీవు ముఖ్యమంత్రివి. తప్పులు ఏం జరిగినయో, ఎవరెవరు బాధ్యులో వారిని లోపలవెయ్, మేమేమీ వద్దనడం లేదు. కానీ లీక్‌లు మాత్రం బంద్ చేయ్' అని పేర్కొన్నారు. దొంగల ఫోన్లు ట్యాప్ చేయడం పోలీసుల పని అని, చేస్తే గిస్తే ఒకరిద్దరి లుచ్చాగాళ్ల ఫోన్లు ట్యాప్ చేసి ఉండొచ్చని, ఆ విషయం తనకేమీ తెలియదని పేర్కొన్నారు. అంతర్జాతీయ కుంభకోణం ఏదో జరిగినట్టు, ఏమో అయిపోయినట్టు కాంగ్రెస్ హామీలపై ప్రజల దృష్టిని మరల్చడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

రేవంత్ పారిపోయిండు

తన సిట్టింగ్ ఎంపీ స్థానం మల్కాజిగిరిలో పోటీ చేయడానికి రేవంత్ జంకుతున్నారని కేటీఆర్ విమర్శించారు. ఇద్దరం ఎమ్మెల్యే స్థానాలకు రాజీనామా చేసి, మల్కాజిగిరిలో పోటీ చేద్దామన్న తన సవాల్‌ను స్వీకరించడం లేదని ఎద్దేవా చేశారు. సీఎం పదవిలో ఉండి కూడా మల్కాజిగిరిలో పోటీకి రేవంత్‌రెడ్డి భయపడుతున్నారని, ఆయన పిరికోడని విమర్శించారు. దమ్ముంటే ఇప్పటికైనా పోటీకి రావాలని సవాల్ చేశారు. బిల్డప్‌లు, మాటలు ఎక్కువ.. అసలు కాడికి వచ్చేసరికి పారిపోతడని ఎద్దేవా చేశారు. ఎంపీగా ఐదేండ్లలో రేవంత్‌రెడ్డి ఒక్క పనీ చేయలేదని, ఒక్క కాలనీ తిరగలేదని దుయ్యబట్టారు. మెడలో పేగులు వేసుకుంటానంటడు, ఆయన ఏమైనా బోటి కొడతడా? అని మండిపడ్డారు. సచివాలయంలో లంకబిందెల సంగతేమో కానీ, హైదరాబాద్‌లో ఖాళీ బిందెలు కనిపిస్తున్నాయని విమర్శించారు. లంకెబిందెల కోసం తట్ట, పారలు పట్టుకొని, అర్ధరాత్రి చీకట్లో కరుడుగట్టిన దొంగలు తిరుగుతారని చెప్పారు. అడ్డగోలుగా మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి సీఎంగా ఉండటంతో ప్రజలు సిగ్గుపడుతున్నారని దుయ్యబట్టారు. సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల తీర్పుతో ఆ నోరు మూతపడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అయితే నా జేబులో ఉండాలి లేదంటే జైల్లో ఉండాలనే విధంగా మోదీ ప్రవర్తన ఉన్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

కాంగ్రెస్ మనిషివా? బీజేపీ మనిషివా?

రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ మనిషో, బీజేపీ మనిషో తనకు అర్థం కావడంలేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాహుల్‌గాంధీ దేశమంతా తిరిగి మోదీని 'చౌకీదార్ చోర్ హై' అంటే, రేవంత్‌రెడ్డి మాత్రం 'మా బడే భాయ్' అంటున్నాడని గుర్తుచేశారు. అదానీ ఫ్రాడ్ అని రాహుల్ అంటే, రేవంత్‌రెడ్డి మాత్రం 'హమారా ఫ్రెండ్ హై' అంటున్నాడని దుయ్యబట్టారు. గుజరాత్ మాడల్ చేస్తానంటున్న రేవంత్‌రెడ్డి.. గోద్రా హింస చేస్తారా? బుల్డోజర్లు తీసుకొచ్చి పేద ప్రజలపైకి నడిపిస్తాడా? అని ప్రశ్నించారు. కేజ్రీవాల్‌ని అరెస్ట్ చేస్తే రాహుల్‌గాంధీ అన్యాయం అంటాడని, అదే కేసులో ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేస్తే రేవంత్‌రెడ్డి మాత్రం కరెక్టే అంటాడని దుయ్యబట్టారు. రాహుల్‌గాంధీ కరెక్టా? రేవంత్‌రెడ్డి కరెక్టా? అనేది కాంగ్రెస్ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌కు ఒక్కఓటు వేసినా, అది నేరుగా బీజేపీకి లాభం జరుగుతుందని చెప్పారు. 30-40 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి బీజేపీలోకి పోయేందుకు రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని, మోదీ కాళ్ల దగ్గర ఉండాలనేది ఆయన ఎత్తుగడ అని ఎద్దేవా చేశారు. ఇది జరగబోయే వాస్తవమని, పార్లమెంట్ ఎన్నికల తర్వాత రేవంత్ బీజేపీలోకి వెళ్తాడని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి తిరగని పార్టీ దేశంలో లేదని విమర్శించారు. ఏబీవీపీ నుంచి టీఆర్ఎస్‌కి, టీఆర్ఎస్ నుంచి టీడీపీకి, టీడీపీ నుంచి కాంగ్రెస్‌కి వెళ్లాడని గుర్తుచేశారు. కాంగ్రెస్ నుంచి మళ్లీ మాతృసంస్థ బీజేపీకి వెళ్తాడని చెప్పారు. రేవంత్‌కు అవకాశవాదమే తప్ప మరే ఎజెండా లేదని దుయ్యబట్టారు.

కాంగ్రెస్‌పై అన్ని వర్గాల్లో ఆగ్రహం

రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం సంక్షోభంలో చిక్కుకున్నా, కరువుతో సతమతమవుతున్నా, అకాల వర్షాలతో ఇబ్బందులు పడుతున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. కల్యాణిలక్ష్మి పథకం కింద తులం బంగారం ఇవ్వడంలేదని, రైతులకు రుణమాఫీ చేయలేదని, వడగండ్ల వర్షం వచ్చినా రైతులను పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ ఇచ్చిన 30 వేల ఉద్యోగాలను తన ఖాతాలో వేసుకున్న రేవంత్‌పై యువత కోపంగా ఉన్నారని చెప్పారు. రైతులు, ఆటో డ్రైవర్లు, వృద్ధులు, మహిళలు ఇలా అన్ని వర్గాలు కాంగ్రెస్ పాలనపై ఆగ్రహంగా ఉన్నాయని, ఏ ఒక్కవర్గం కూడా సంతోషంగా లేదని వివరించారు. రేవంత్‌రెడ్డి నుంచి మొదలుకొని యూట్యూబ్‌లో అడ్డగోలుగా పార్టీపై, పార్టీ నాయకత్వంపై మొరిగే కుక్కలపై తాము దాడులు చేయాల్సిన అవసరం లేదని, ఓటు ద్వారానే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఓటుతో ఇలాంటి సన్నాసులపై వేసే వేటే సరియైన సమాధానమని పేర్కొన్నారు. రూ.రెండు లక్షల రుణమాఫీ జరిగిన వాళ్లందరూ కాంగ్రెస్‌కు ఓట వేయాలని, రుణమాఫీ జరగని వాళ్లు బీఆర్ఎస్ ఓటువేయాలని కోరారు. కంటోన్మెంట్‌లో ఎమ్మెల్యే చనిపోయారని, అక్కడ నందిత కుటుంబం, క్రిశాంక్, నగేశ్, మహేశ్, పాండు, లోకనాథం తదితర చురుకైన నాయకులు ఉన్నారని పేర్కొన్నారు.

మల్కాజిగిరికి బీజేపీ చేసిందేమిటి?

హుజూరాబాద్, గజ్వేల్‌లో ఓడిపోయిన ఈటల రాజేందర్ మల్కాజిగిరికి వచ్చాడని కేటీఆర్ ఎద్దేవా చేశారు. బీజేపీ నేతలు రైతు రుణమాఫీ గురించి మాట్లాడితే దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉంటుందని చెప్పారు. కార్పొరేట్లకు రూ.14.50 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసిన మోదీ ప్రభుత్వం.. రైతన్నలకు ఒక్క రూపాయి కూడా మాఫీ చేయలేదని దుయ్యబట్టారు. దమ్ము, ధైర్యం ఉంటే బీజేపీ ప్రభుత్వం మల్కాజిగిరికి, కంటోన్మెంట్‌కి ఏం చేసిందో చెప్పి ఈటెల ఓటు అడగాలని సవాల్ చేశారు. బీజేపీకి ఎలక్ట్రోబాండ్ల రూపంలో రూ.11 వేల కోట్లపైన ఉన్నమాట వాస్తవం కాదా? కుబేరుల జాబితాలో 609వ స్థానంలో ఉన్న అదానీని తీసుకొచ్చి రెండో స్థానంలో కుర్చోబెట్టిన మోదీ నీతిమంతుడా? అని ప్రశ్నించారు.

వాళ్లకు ఓటు అడిగే హక్కు లేదు: మల్లారెడ్డి

కాంగ్రెస్, బీజేపీ ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతాయని, మోసం చేసినందుకు ఓట్లు వేయాల్నా? అని మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. రెండు పార్టీలు చేసిందేమీ లేదని, వాళ్లకు ఓటడిగే హక్కులేదని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేశామా? అని ఇప్పుడు బాధపడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నీ బంద్ చేస్తున్నదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో రోజూ వర్షం పడేదని, పిలిస్తే వానొచ్చేదని, ఇప్పుడు చెరువులన్నీ బోసిపోయి కనిపిస్తున్నాయని చెప్పారు. కేటీఆర్ చేసిన అభివృద్ధి కారణంగానే హైదరాబాద్, రంగారెడ్డిలో ఎమ్మెల్యేలు గెలిచారని, హైదరాబాద్‌లో ఏ ఫ్లైఓవర్ చూసినా కేటీఆర్ కనిపిస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్ బోసిపోయిందని, కళ తప్పిందని చెప్పారు.

> 'నువ్వు రాహుల్‌గాంధీ మనిషివా? నరేంద్ర మోదీ మనిషివా? బీజేపీ మనిషివా? కాంగ్రెస్ మనిషివా? రేవంత్‌రెడ్డి చెప్పాలె. పార్లమెంట్ ఎన్నికల తరువాత 30-40 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి బీజేపీలోకి వెళ్లేందుకు రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నాడు.' -కేటీఆర్

బీఆర్ఎస్‌తోనే హైదరాబాద్ అభివృద్ధి

హైదరాబాద్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఐటీలో హైదరాబాద్‌ను దేశంలోనే టాప్‌గా నిలిపిన ఘనత కేటీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. ఓడిపోయిన వారికి మల్కాజిగిరి పునరావాస కేంద్రంగా మారిందా? అని ప్రశ్నించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, సుధీర్‌రెడ్డి, కేపీ వివేకానంద, మాధవరం కృష్ణారావు, బండారు లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు వాణీదేవి, యెగ్గె మల్లేశం, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'వాళ్లు వెన్నుపోటు పొడిచిపోయారు'

మల్కాజిగిరిలో నిలబడింది రాగిడి లక్ష్మారెడ్డి కాదు- మన గులాబీ సైనికులంతా నిలబడ్డారు అన్న రీతిలో పనిచేద్దామని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. సీనియారిటీ కంటే సిన్సియారిటీ ముఖ్యమని, అది రాగిడిలో ఉన్నదని చెప్పారు. మల్కాజిగిరి ఎంపీ నియోజకవర్గ పరిధిలో మూడున్నర లక్షల మెజార్టీ బీఆర్ఎస్‌కు ఉన్నదని, అయినా మనం మన కార్పొరేటర్, సర్పంచ్ ఎన్నికల స్థాయిలో పనిచేద్దామని కోరారు. మల్కాజిగిరిలో పోటీచేస్తున్న కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు కేసీఆర్ ద్వారా పదవులు పొంది వెన్నుపోటు పొడిచి వెళ్లినవారేనని, వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

- కారణజన్ముడు కేసీఆర్ సీడీ ఆవిష్కరణ

దండెం దరువు యూట్యూబ్ చానల్ ద్వారా దండెం నరేందర్ రాసి పాడిన 'కారణజన్ముడు కేసీఆర్', 'కలియుగ రాముడు కేసీఆర్' పాటల సీడీని తెలంగాణ భవన్‌లో బుధవారం ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, తదితరులు - మల్లాపూర్, మార్చి 27

అధికారం, ఆస్తుల కోసమే రంజిత్‌రెడ్డి ద్రోహం

- పార్టీ ఏం తక్కువ చేసిందని వెళ్లారు?
- 13న చేవేళ్లలో బీఆర్ఎస్ బహిరంగ సభ
- హాజరుకానున్న పార్టీ అధినేత కేసీఆర్
- చేవెళ్లలో కాసాని గెలుపు ఖాయం
- నియోజకవర్గం ఎమ్మెల్యేలు, నేతలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): అధికారం, ఆస్తులు కాపాడుకోవడానికే చేవేళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి పార్టీ మారారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ధ్వజమెత్తారు. ఆయనకు బీఆర్ఎస్ ఏం తక్కువ చేసిందని పార్టీని విడిచి వెళ్లారని ప్రశ్నించారు. చేవేళ్లలో సామాజిక సమీకరణాల రీత్యా బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు సులువు అవుతుందని ధీమా వ్యక్తంచేశారు. ఏప్రిల్ 13న చేవేళ్లలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని, ఈ సభకు పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ హాజరవుతారని వెల్లడించారు. బుధవారం ఆయన తెలంగాణభవన్‌లో చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. సమావేశానికి కాసాని జ్ఞానేశ్వర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన ఎంపీ రంజిత్‌రెడ్డిపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. రంజిత్‌రెడ్డి ఎవరో బీఆర్ఎస్ సీటు ఇచ్చి, గెలిపించుకున్న తర్వాతనే ప్రపంచానికి తెలిసిందని పేర్కొన్నారు. రాజకీయాలకు కొత్త వాడైనా 2019లో ప్రతి కార్యకర్త కష్టపడి ఆయనను గెలిపించారని చెప్పారు. రంజిత్‌రెడ్డికి రాజకీయంగా పార్టీలో అత్యధిక ప్రాధాన్యం, నియోజకవర్గంలో స్వేచ్ఛ ఇచ్చామని తెలిపారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయనని, రాజకీయాల నుంచి తప్పుకుంటానని పార్టీ ముందు అనాసక్తతను వ్యక్తంచేసిన రంజిత్‌రెడ్డి.. కేవలం అధికారం, ఆస్తుల కోసమే బీఆర్ఎస్‌ను విడిచి ద్రోహం చేశారని మండిపడ్డారు. పార్టీ సీనియర్ నాయకురాలు, రంజిత్‌రెడ్డి తన సోదరి అని చెప్పుకునే కవితపై కేంద్ర ప్రభుత్వ సంస్థలు సోదాల పేరుతో దాడి చేసి, అరెస్టు చేసిన రోజే ఆయన నవ్వుకుంటూ పార్టీకి ద్రోహం చేసి, కాంగ్రెస్‌లో చేరిన స్వార్థపరుడని ధ్వజమెత్తారు.

కాసాని జ్ఞానేశ్వర్ అందరి మనిషి

గతంలో ఎన్నికలకు ముందు అప్పటి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కూడా పార్టీ కన్నా తానే ఎక్కువ అనుకొని వేరే పార్టీలోకి వెళ్తే ఫలితం ఏమైందో అందరికీ తెలుసని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ అహంకారం ఉన్న వ్యక్తులు రాజకీయాల్లో గెలవరని స్పష్టంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి కలిసినంత మాత్రాన కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో కలిసిపోతాయనుకోవడం వారి రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమని పేర్కొన్నారు. నేడు కాంగ్రెస్‌లో అయోమయం నెలకొన్నదని, చేవెళ్లలో ఆ పార్టీకి కనీసం అభ్యర్థి కూడా దొరకలేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజులతోపాటు బీసీలకు కొన్ని దశాబ్దాలుగా అండగా నిలబడిన వ్యక్తి అని కొనియాడారు. ఒకవైపు బీసీల కోసం పాటుపడుతూనే, మరోవైపు అన్ని సామాజిక వర్గాలను, మైనార్టీలను కలుపుకుపోయిన మంచి మనిషి అని ప్రశంసించారు.

కాంగ్రెసోళ్లు ఏం తెచ్చిండ్రు?

ఓటేసినంక బూటు కాలు చూపిస్తున్నరు

- రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే మందలియ్య ఒక్క మంత్రికీ తీరికలేదా?
- బీజేపోళ్లు, కాంగ్రెసోళ్లు ఎన్నడైనా జై తెలంగాణ అని అన్నరా?
- కేసీఆర్ పదేండ్లు పదిలంగ చూసుకుండు
- కాంగ్రెస్‌పై విరుచుకుపడిన జవహర్‌నగర్ కేతమ్మ

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మహిళా కార్యకర్త కేతమ్మ. పక్కన కేటీఆర్, రాగిడి, సుధీర్‌రెడ్డి, వాణీదేవి తదితరులు

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): కాంగ్రెసోడు ఏం తెచ్చిండు? 'ఒక్కసీటు తెచ్చుకో నువ్ మొగోనివైతే' అన్నడు. 'ఒక్కటి కాదు ప్రతి ఎంపీని గెలిపిచ్చుకుందాం' అని జవహర్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ మహిళా కార్యకర్త కేతమ్మ పోరు కేక పెట్టింది. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ఒక్కమంత్రికీ తీరికలేదా మందలియ్య?' అని నిప్పులు చెరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఎకరాలకు నీళ్లు ఇస్తున్నదని ప్రశ్నించింది. బుధవారం తెలంగాణభవన్‌లో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశం జరిగింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, కేపీ వివేకానంద, మాధవరం కృష్ణారావు, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు మల్లేశం, వాణీదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేతమ్మ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తూర్పారబట్టింది. సమావేశంలో కేతమ్మ ప్రసంగం ఆమె మాటల్లోనే..

బూటు కాలు చూపిస్తున్నరు!

జై తెలంగాణ.. జై కేసీఆర్.. జై కేటీఆర్.. జై మల్లారెడ్డి. తెలంగాణల కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక ఎట్లున్నది? ఆనాడు ఎట్లున్నది? నాయినా, ఇయ్యాల కాంగ్రెస్ పార్టీ వాళ్లు మసిపూసి మారేడు కాయ చేసి, కండ్లకు గంతలు కట్టి ఆరు పథకాల హామీలు ఇచ్చి గద్దెకెక్కిరి. ఓటేసినంక బూటుకాలు చూపిస్తున్నరు. ఇయ్యాల 24 గంటలు మేడిబాయి, ఆలుగడ్డబాయి అంటూ తిరుగుతున్నరు. రైతులను పట్టించుకుంటలేరు. రైతులకు సాగునీళ్లు లెవ్వు, తాగునీళ్లు లెవ్వు. కేసీఆర్ పదేండ్లు ప్రజలను పదిలంగా కాపాడుకున్నరు. ప్రజలమందరం పదిలంగా ఉన్నం. కేసీఆర్, కేటీఆర్ ఆనాడు ఉద్యమాలు చేశారు. జై తెలంగాణ అన్నరు. జైలు కూడుతిన్నరు. లాఠీ దెబ్బలు తిన్నరు. జై తెలంగాణ నినాదాలు చేసిర్రు. ఆనాడు బీజేపోళ్లు వచ్చి జెండా లేపిర్రా? కాంగ్రెసోళ్లు వచ్చి జెండా లేపిర్రా? ఏనాడూ వారు జై తెలంగాణ అనలే.

గెల్వంగనే కాంగ్రెస్ పత్తాకు లేకపాయె

తెలంగాణల పదేండ్లు కేసీఆర్ తాగునీళ్లు, సాగునీళ్లు, హరితహారం, అమ్మఒడి, ఆశావర్కర్లు, కంటివెలుగు, రెండువేల పింఛన్ ఇస్తే.. గెల్వంగనే నాలుగు వేల పింఛన్ ఇత్త అన్నవ్. డిసెంబర్ 9న రెండు లక్షల రుణమాఫీ అన్నవ్. ఏదీ రుణమాఫీ? కేసీఆర్ గెలిచినంక 2.8 కోట్ల ఎకరాలకు నీళ్లు ఇచ్చిండు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆనాడు నీళ్లు లేక, నిధుల్లేక రైతులు ఆత్మహత్యలు చేసుకున్నరు. పొలాలను అడ్డికి పావుసేరు అమ్ముకున్నరు. దేశాలు పట్టిర్రు. బొంబాయి కూలికి పోయిండ్రు. కేసీఆర్ తెలంగాణ తెచ్చినంక కొన్ని కోట్లు పెట్టినా ఎకరం భూమి దొరుకుతలేదు.

ఒక్కమంత్రికీ తీరికలేదా?

ఒక్కొక్క రైతు ఐదారు బోర్లు ఎస్కుంటున్నరట. ఐదారు లక్షలు అవుతున్నయట. నెర్రబట్టిన పొలాలను చూసి రైతులు మళ్లా ఆత్మహత్యలు చేసుకుంటున్నరు. ఇప్పటికే 180 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నరు. అంతమంది ఆత్మహత్య చేసుకుంటే ఒక్కరూ పోలే. మళ్లా ఇప్పుడు కేటీఆర్ తిరుగుతుండు. హరీశ్‌రావు తిరుగుతుండు. అటుచేసి ఇటుచేసి రైతుల కోసం పాట్లుపడేది మన తెలంగాణ బిడ్డలు రామన్న, హరీశన్న మాత్రమే.

ఎన్ని బాధలయ్యా? ఎన్ని కష్టాలయ్యా?

కాంగ్రెసోళ్లు వచ్చినంక కల్యాణలక్ష్మిపాయె, షాదీముబారక్‌పాయె, కేసీఆర్ కిట్టుపాయె. రెండు లక్షలు పాయె. ఏం బస్సు ఎక్కితే ఎంత? ఎక్కకుంటే ఎంత? కాంగ్రెసోడు ఏంతెచ్చిండు? ఒక్క బస్సు తెచ్చిండు! ఆరు పథకాలల్ల ఒక్కటీ కాలే. మల్కాజిగిరి ప్రజలారా.. నల్లగొండ కావచ్చు, హన్మకొండ కావచ్చు, వరంగల్ కావచ్చు, కరీంనగర్, మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి, ఖమ్మం ఎక్కడైనా సరే ఎంపీగా నిలబడితే కారు గుర్తుకు ఓటేపిద్దాం. వెనక్కు తగ్గేదిలే. నాది నీది అనుకోవద్దు. మనకు పగలొద్దు, కష్టపడదాం. ఒక్కటి కాదు ప్రతీ ఎంపీని గెలిపించుకుందాం. కేసీఆర్‌కు గిఫ్టుగా ఇద్దాం. అయ్యా, అమ్మా, నా రైతన్నలారా ఇప్పటికే మీరు తప్పిదారి చెయ్యికి ఓటేసి మీరు తోడుకున్న గోతిల మీరే పడ్డరు. ఇప్పటికైనా కండ్లు తెరుచుకోండి. కండ్లుతెరచి కారు గుర్తుకు ఓటెయ్యండి. జై తెలంగాణ.. జై కేసీఆర్.. జై కేటీఆర్.. జై మల్లారెడ్డి.

లోకం పోకడ



ఎండా కాలం

సెగలుగక్కుతున్న సూరీడు

- పలు జిల్లాలకు వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా సూరీడు సెగలుగక్కుతున్నాడు. భానుడి భగ భగలకు ఉదయం 9 గంటలకే మాడు పగులుతున్నది. బయటకు రావాలంటేనే జనం భయపడే పరిస్థితి నెలకొన్నది. రాబోయే మూడు రోజులూ మరింత పెరుగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నట్టు ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. ఈ ఏడాది లోనే అత్యధిక ఉష్ణోగ్రతలు ఆదిలాబాద్ జిల్లాలో నమోదయ్యాయి. మంగళవారం తలమడుగు, జైనథ్ మండలాల్లో గరిష్ఠంగా 42.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. బేల మండలం చప్రాలలో 42.1 డిగ్రీలు, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్‌లో 42 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయ్యింది. రాష్ట్రవ్యాప్తంగా 12 జిల్లాల్లో 40.8 డిగ్రీల నుంచి 42.3 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్,మంచిర్యాల, ఆసిఫాబాద్, పెద్దపల్లి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేశారు. గురువారం వేడిగాలులు కొనసాగుతాయని, భూపాలపల్లి, ములుగు, వరంగల్, హనుమకొండ,మహబూబ్‌నగర్, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ, నారాయణపేట జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని వాతావరణశాఖ చెప్పింది. వచ్చే ఐదు రోజులు ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది. రాష్ట్ర అభివృద్ధి, ప్రణాళికా సంస్థ ఎండల పెరుగుదలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది.

400 మందితో సర్కారు చెలగాటం

- నెలన్నరగా పోస్టింగులు లేక ఎక్సైజ్ కానిస్టేబుల్ అభ్యర్థుల ఆందోళన
- అకాడమీ మరమ్మతులకు ప్రతిపాదనలు పంపి నెల దాటినా రూ.15 లక్షలు విదిల్చని రేవంత్ సర్కారు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మార్చి 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థులకు నెలన్నర క్రితమే అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చినా ఇప్పటికీ పోస్టింగులు మాత్రం ఇవ్వలేదు. ఇదేమిటని అధికారులను సంప్రదిస్తే ఆయా అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు తెలంగాణ ఎక్సైజ్ అకాడమీ సిద్ధం కాలేదని చెప్తున్నారు. అకాడమీలో మరమ్మతు పనులకు అవసరమైన రూ.15 లక్షల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనల